
# మా పెళ్ళికి రండి...

పోట్లూరి సుబ్రహ్మణ్యం



కేశవయ్య ఆ పల్లెటూర్లో తన చెల్లెలు వివాహం అంత ఘనంగా చేస్తాడని ఎవరూ ఊహించి ఉండ లేదు. పల్లెటూర్లో వ్యవసాయం చేసు కొని కేశవయ్య చెల్లెల్ని ఇంజనీరుకిచ్చి చేసాడు. తల్లిదండ్రులు ఉన్నా ఈడు వచ్చినప్పటినుండీ పెత్తనమంతా కేశవ య్యదే. ఆరుమైళ్లదూరంలో ఉన్న తెనాలికి వెళ్లి వస్తూ యసల్సీ వరకూ చదివి సేద్యంలో దిగాడు. చెమటోడ్చి ఆరెకరాల ఆస్తిని పదెకరాలు చేసాడు. పట్నం సంబంధాలు మనం తూగలే మురా అని తల్లిదండ్రులు కొట్టుకుం టున్నా వినకుండా రెండు లక్షల రూపాయలు కట్నం క్రింద ఇచ్చి, దాంతోబాటు యాభై సవర్ల బంగారం చెల్లెలికి పెట్టి, పెళ్లి ఖర్చులు తనే భరించాడు.

నాజుగ్గా ఉన్న చెల్లెలు రాజ్యలక్ష్మి ప్రక్కన హుందాగా నిలబడి ఉన్న ఇంజనీరు శంకరరావును అందరూ ' చిలకా గోరింకల్లా ఉన్నారు. ' అని పొగుడుతూ ఉంటే ఆకాశంలో తేలిపోయాడు కేశవయ్య. తను పెద్దగా చదువుకోక పోయినా చెల్లెల్ని మాత్రం బాగా చదువుకున్న కుటుంబంతో సంబంధం కలిపాడు.

అత్తగారింటికి పంపేటప్పుడు తన స్థితికి తగ్గట్లు అన్ని లాంఛనాలతోబాటు, ఎన్నో కానుకలు అందజేసాడు. కారెక్కబోతూ అన్న కాళ్లకి నమస్కరించి లేచిన చెల్లెలి చేతిలో పెట్టిన తన వాటా పొలం అగ్రిమెంటు పత్రాలు చూసి నివ్వెరపోయింది రాజ్యలక్ష్మి.

"ఏమిటిది అన్నయ్యా, త్యాగానికయినా హద్దుండాలి. నాకింత కట్నమిచ్చి, ఇంత వైభవంగా పెళ్లి చేసావు. ఇంకా ఆస్థిలో నాకు వాటా కూడానా" అంటూ ఏడ్చింది.

" ఏం ఫరవాలేదమ్మా, పసుపుకుంకుమల క్రింద నేను సంతోషంగా ఇస్తున్నాగా, తీసుకో. " అన్నాడు కేశవయ్య.

" క్షమించు బావా, నీ ఆస్తిలో మాకు వాటా వద్దు. నీకింకా పెళ్లి కాలేదు. నువ్వు పెళ్లి చేసుకోవాలి. ముసలి తల్లిదండ్రులను చూసుకో వలసిన బాధ్యత కూడా నీమీదే ఉంది. పల్లె అయినా వ్యవసాయం ఖర్చులెంతుంటాయో నాకూ తెలుసు. లక్ష్మీ! ఆ కాగితాలు ఇచ్చేసెయ్ " మృదువుగా అన్నాడు శంకరరావు.

అంతపెద్ద ఇంజనీరు శంకరరావు ' బావా ' అన్నప్పుడల్లా కేశవయ్య మనసు గాలిలో తేలిపోతూ ఉంటుంది. పల్లెలో ఈ మారుమూల పడుండే తనెక్కడ ? వైజాగ్‌లో ఇంజనీరు ఉద్యోగం చేస్తూ పదిమందిలో గొప్పగా తిరిగే తన చెల్లెలు భర్త ఎక్కడ? తన చెల్లెలిని ఒక విద్యావంతుడికి ఇవ్వబట్టికదా తనకింత గౌరవమొచ్చిందని మురిసి పోతుంటాడు.

తిరిగి తన చేతికివ్వబోతున్న చెల్లెల్ని చేతులు పట్టుకొని ఆపి " బావా! ఒకసారి పసుపుకుంకుమల క్రింద ఇచ్చిన ఆస్థి తిరిగి తీసుకోకూడదు. కాదనకు" అన్నాడు కేశవయ్య ఎంతో నమ్రతగా.

శంకరరావు మృదుస్వభావి. చాలా తక్కువగా మాట్లాడుతాడు. " సరే బావా! పొలం మాకని ఇచ్చినా, దీన్ని మేము ఎప్పటికీ అమ్మేది లేదు. నీ సాగుబడిలోనే ఉంటుంది. " అంటూ భార్య చేతిలోని అగ్రిమెంటు పత్రాలు తీసి అతని దగ్గరే దాచి ఉంచమని ఇచ్చాడు.

చెల్లెల్ని అత్తగారింట వదలడానికి వచ్చిన కేశవయ్యను నెత్తిన పెట్టుకొని చూసాడు శంకరరావు. తన ఆఫీసులోని తోటి ఇంజనీర్లను ఇంటికి డిన్నర్‌కి పిలిచి ' ఈయన మా బావ ' అంటూ తెల్లని పంచెకట్టులో ఉన్న తనను ఏ మాత్రం అవమానం ఫీల్ గాకుండా అందరికీ పరిచయం చేయడం, కేశవయ్యకు ఎంతో ఆనందమనిపించింది.

తరువాత రెండు రోజులు సెలవు పెట్టి భార్యని, బావ కేశవయ్యను వైజాగ్ అంతా తిప్పి చూపాడు. ఒకరోజు కైలాసగిరి కొండ, రామకృష్ణా బీచ్, ఆంధ్రాయూనివర్శిటీ, సింహాచలం, జూపార్కు. మరోరోజు వేకువనే కారులో తీసుకెళ్లి అరకులోయ తిప్పి తీసుకువచ్చాడు.

తన పల్లెకు తిరిగివచ్చిన కేశవయ్య గ్రామస్తులకు తన బావ తనకు చేసిన మర్యాదలను, చూపిన ఆప్యాయతలను కథలు కథలుగా చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. నాలుగో రోజు చెల్లెల్నించి అతనికో ఉత్తరం వచ్చింది.

పూజ్యులయిన అన్నయ్యకు,

నమస్కారం.

అన్నయ్యా! నువ్వు ఇంత ఖర్చుపెట్టి పెళ్లి చేసినందుకు నాకు క్షణక్షణం మనసు కలవర పెడుతూ ఉంది. నిద్ర కూడా పట్టడం లేదు. నువ్వు కట్నకానుకలు ఇవ్వడం వల్లనయితేనేమి, భారీగా పెళ్లి జరపడం వల్లనయితేనేమి, నువ్వు లక్ష రూపాయలవరకు అప్పు పడ్డావని నాకు తెలుసు. వ్యవసాయంమీద వచ్చే కొద్దీ ఆదాయంతో వడ్డీలతో కలిపి అప్పు ఎలా తీర్చగలవు. గంతకు తగ్గ బొంతనిచ్చి పెళ్లి చేయమంటే పంతాలకు పోయి నా చెల్లెలు గొప్పగా ఉండాలని ఇంజనీరుకిచ్చి చేసావు. ఆయన మంచివాడే. నాకిక్కడ సుఖమే. నీ కష్టాలు తలచుకుంటేనే మనసు కలత చెందుతూ ఉంది. నీ ఋణం ఎలా తీర్చుకోను. నా శరీరం ఇక్కడున్నా మనసంతా మన కుటుంబం గురించే ఆలోచిస్తూ ఉంది. నా కిచ్చిన వాటా తిరిగి తీసుకో. అది అమ్మయినా అప్పుతీర్చు.

ఇట్లు

నీచెల్లెలు,

రాజ్యలక్ష్మి.

చెల్లెలు అభిమానానికి నవ్వుకున్నాడు కేశవయ్య. ఇంజనీరుకిచ్చిన రెండు లక్షల కట్నం నిజానికి చాలా తక్కువని, చెల్లెలు అందానికి మురిసే చేసుకున్నాడని, లక్ష అప్పు తనకొక పెద్ద లెక్క కాదని అవసరమైతే ఇంకొంత పొలం కౌలుకు తీసుకొని రెండేళ్లలో తీర్చేస్తానని, దిగులేమీ పెట్టుకోవద్దని, సంతోషంగా ఉండమని ఊరడిస్తూ ఉత్తరం వ్రాసాడు.

రోజులు గడుస్తున్నాయి. చెల్లెలు ' నీ ఋణం తీర్చుకోలేను అన్నయ్యా ' అంటూ వారం వారం ఉత్తరాలు వ్రాస్తూనే ఉంది. కేశవయ్య చెల్లెల్ని ఊరడిస్తూ ప్రతి ఉత్తరానికీ జవాబులు వ్రాస్తున్నాడు. ప్రతి పండుగకూ ముందురోజు తను వెళ్లి వాళ్లని పండుగకు రమ్మని ఆహ్వానించేవాడు. వాళ్లు కొన్ని పండుగలకు వచ్చే వాళ్లు. మరికొన్ని పండుగలకు 'బావకు సెలవు దొరకక రాలేక పోయామని' ఉత్తరాలు వ్రాసేది చెల్లెలు.

ఏది ఏమయినా ఉగాది పండుగకు మాత్రం తనే దగ్గరుండి వాళ్లను తీసుకువచ్చేవాడు. ఆ రోజుకి ఆ కోతలు అయిపోయి ధాన్యం అమ్మిన డబ్బు చేతిలో ఉండేది. ఆమె వద్దని మొత్తుకున్నా వినకుండా ఆమె భాగం పొలం మీద వచ్చే ఆదాయాన్ని పువ్వుల్లో పెట్టి ఇచ్చేవాడు. అంతేగాక తన ఖర్చుతో బావకు, చెల్లెలికి కొత్త బట్టలు పెట్టేవాడు.

మూడో ఉగాదికి ఆమె గర్భవతైంది. కేశవయ్య ఆనందం అంతా ఇంతా కాదు. ఆమెను ఐదో నెల నుంచే ఇంట్లో పెట్టుకొని సీమంతం చేసి అన్ని సంబరాలు జరిపాడు.

" అన్నయ్యా! నేను ప్రసవించి బిడ్డ నెత్తుకొని వెళ్లేలోగా నీ పెళ్లి చేసి మరీ వెల్తాను." అని ప్రతిజ్ఞ చేసింది రాజ్యలక్ష్మి. అనటమే కాదు. చుట్టు ప్రక్కల సంబంధాలు కూడా వాకబు చేయసాగింది. తల్లిదండ్రుల్ని పురమాయించింది.

కేశవయ్యకు కూడా తను అభ్యంతరం చెప్పడానికి ఏ కారణమూ కనిపించలేదు. అప్పటికి చేసిన అప్పు కూడా తీరిపోయింది.

రాజ్యలక్ష్మి మగపిల్లవాడ్ని ప్రసవించింది. మేనల్లుడు పుట్టేసరికి కేశవయ్య ఆనందం అంతా ఇంతా కాదు. ఊరి నుంచి వచ్చిన బావను ఆనందంతో ఊపేసాడు. బిడ్డకు మూడోనెల వచ్చేసరికి కేశవయ్యకు సంబంధం కుదిరింది. ప్రక్కపల్లెకు రాజ్యలక్ష్మి, భర్తతో వెళ్లి చూసి వచ్చింది. అన్నయ్యను వెళ్లి చూసి రమ్మంది. ' నువ్వు చూసి నచ్చిన తరువాత నాదేముందమ్మా. ' అన్నాడు. కేశవయ్య. చెల్లెలు ఒప్పుకోలేదు. తరువాత కేశవయ్య తల్లిదండ్రులతో నామమాత్రంగా వెళ్లి చూసాడు.

బిడ్డకు అయిదో నెలలో అన్నయ్యకు పెళ్లి చేసి, అచ్చట్లు ముచ్చట్లు తీరిందాకా ఉండి, బిడ్డతో వైజాగ్ వెళ్లిపోయింది రాజ్యలక్ష్మి. కేశవయ్య భార్యకు ఆమె తల్లిదండ్రులు పసుపుకుంకుమల క్రింద రెండెకరాలు పొలం ఇచ్చారు. కేశవయ్య దాన్ని అమ్మి భార్య పేరుమీద తనూర్లోనే రెండెకరాల పొలం కొన్నాడు. సరిగ్గా పెళ్లయిన రెండున్నరేళ్ళకు కేశవయ్యకు ఆడపిల్ల పుట్టింది.

వార్త అందుకొని, హడావుడిగా వచ్చింది రాజ్యలక్ష్మి. అన్నయ్య వెంట, వదిన ఊరికి వెళ్లి ఉయ్యాల్లోని బిడ్డను చూసి మురిసి పోయింది.

" అన్నయ్యా! నీ ఋణం ఎలా తీర్చుకోవాలో ఇంతకాలం అర్థంగాక తలబాదు కున్నాను. ఇప్పుడిక ఆ బాధలేదు. నీ కూతుర్ని కానీ కట్నం లేకుండా నా కొడుక్కిచ్చి పెళ్లి చేసుకుంటాను. " నోట్లో వ్రేలేసుకొని తన చెంగు పట్టుకొని నిలబడి ముచ్చటగా ఉన్న తన మూడేళ్ల కొడుకు తల నిమురుతూ అంది.

## కమీషనర్ గారి కళా పిపాస!



ప్రకాష్ దూబె ప్రకృతిని చూసి పుల కరిస్తూ ఉంటాడు. కళల పట్ల ఆసక్తి మెండుగా ఉంది. ఫోటో గ్రఫీలో నిష్ణా తుడు. సుందర దృశ్యాలు కెమెరాలో బంధించడం కొరకు ఎత్తైన పర్వతాలు అధిరో హిస్తాడు, నదులు దాటతాడు, వర్షాన్ని లెక్క చెయ్యడు. ఇంతకీ ఈయన ఎవరనుకుంటు న్నారు? ముంబాయి ఇన్‌కమ్‌టాక్స్ కమీషనర్! సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే పుష్పించే ఓ అరుదైన అతి అందమైన పుష్పాలను కెమారతో చిత్రించడం కోసం ఈ మధ్య భార్యతో కలిసి హిమాలయాల పైకి వెళ్ళాడు. ఇప్పటికి ఆ కమీష నర్‌గారు 4 పుస్తకాలు ప్రచురించాడు. తను తీసిన ఫోటోలతో 5వ పుస్తకం సిద్ధమవుతోంది. రకరకాల విహంగాలు గురించి దూబేగారు తీసిన 'బ్లూపాపీ', 'బ్రహ్మకమల్' పుష్పాలు తిలకించండి! - కొడిమెల

"అలాగే లేమ్మా." అన్నాడు కేశవయ్య నవ్వుతూ.

ఒప్పుకోలేదు రాజ్యలక్ష్మి. అన్నయ్య చేత, ఒదిన చేత ఆ విధంగా ఒట్టేయించుకొంది.

రోజులు గడుస్తున్నాయి. రాజ్యలక్ష్మి ప్రతి ఉత్తరంలోను అన్నయ్యకు తన ఒట్టు సంగతి గుర్తుచేసి, 'నీ కూతురు సుమతి నా కోడలు.' అని వ్రాసేది. చెల్లెలి ప్రేమాభిమానాలకు మురిసి పోయేవాడు కేశవయ్య. 'అలాగే లేమ్మా' అంటూ జవాబు వ్రాసేవాడు.

కాలక్రమంలో రాజ్యలక్ష్మి కొడుకు ఆనంద్ పదిహేనేళ్ల వాడయ్యాడు. వైజాగ్‌లో టెన్త్ చదువుతున్నాడు. కేశవయ్య కుమార్తె సుమతి తన ఊళ్లోనే ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూలులో ఏడు చదువుతోంది. చిన్నతనం నుంచీ ఆనంద్, సుమతిల మధ్య గాఢమైన అనుబంధముంది, ఆప్యాయతలున్నాయి.

వేసవి సెలవుల్లో సుమతి ఇరవై రోజులు వైజాగ్‌లో బావ ఆనంద్‌తో గడిపితే, మరో ఇరవై రోజులు ఆనంద్ సుమతితో బాటు ఇక్కడ పల్లెటూరికి వచ్చి తోటలూ, దొడ్లూ తిరుగుతూ సంతోషంగా గడిపేవాడు. కేశవయ్య సెలవులు మొదలు కాగానే సుమతిని అక్కడ వదిలి వస్తే, ఓ ఇరవై రోజులు అయిన తరువాత రాజ్యలక్ష్మి కొడుకుని, సుమతిని పల్లెకు తీసుకువెళ్లి వదిలి రెండురోజులుండి తను ఒంటరిగా వైజాగ్ వెళ్లేది. సెలవులయిన తర్వాత కేశవయ్య మేనల్లుడ్ని తీసుకువెళ్లి వైజాగ్‌లో వదిలి వచ్చేవాడు.

మేనత్త చిన్నతనం నుంచీ తను వైజాగ్ వెళ్లినప్పుడల్లా ఒళ్లో పడుకోబెట్టుకొని చెప్పే మాటలు వినీవినీ తను ఆనంద్ భార్యననే గాఢమైన అభిప్రాయం ఏర్పడిపోయింది సుమతికి. అలాగే తల్లి తనను పల్లెలో వదిలి వెళ్లినప్పుడల్లా 'నాయనా ఆనంద్ ! సుమతి నీ కాబోయే భార్యరా. ఆ పిల్ల మనసు ఏ మాత్రం కష్ట పెట్టకు' అని చెప్పీచెప్పీ ఆనంద్ మనసులో కూడా సుమతి అంటే విపరీతమైన ఇష్టం ఏర్పడి పోయింది. అందుకే ఆమెకు ఇష్టమైన పనులు చేసి ఆమెను సంతోష పెట్టేవాడు. ఈ మధ్యకాలంలో కేశవయ్య కాయకష్టం చేసి మరో పదెకరాలు సంపాదించాడు.

ఆనంద్ టెన్త్ డిస్టింక్షనులో పాసయి, ఇంటర్‌లో చేరాడు. సుమతి కూడా సెవెన్త్ క్లాసు ఫస్టుక్లాసులో పాసయి తెనాలిలో ఎనిమిదో క్లాసులో చేరి రోజూ బస్సులో వెళ్లి వచ్చేది. ఒక నెల తర్వాత ఉన్నట్లుండి రాజ్యలక్ష్మి ఒక్కతే వచ్చింది అన్నయ్య దగ్గరకు.

ఇంత సడెన్‌గా వచ్చిందంటే ఏదో విశేషముందనుకొన్న కేశవయ్య ఆమెను ఆప్యాయంగా పలుకరించి కుశల ప్రశ్నలు అడిగి యధారీతి మర్యాదలు చేసాడు.

ఆ రోజు రాత్రి వదిన వడ్డిస్తుండగా తల్లిదండ్రులతో, అన్నయ్యతో కలిసి భోంచేస్తూ అసలు విషయం చెప్పింది రాజ్యలక్ష్మి.

" అన్నయ్యా! మీ బావగారు, కొంతమంది ఇంజనీరు మిత్రులూ ఉద్యోగాలకు రిజైన్ చేసి, అందరూ కలసి సిండికేట్‌గా ఏర్పడి ప్లాట్లు కొని భవనాలు కట్టించే వ్యాపారం చేయాలనుకుంటున్నారు. పెట్టుబడికి సంవత్సరంలో నాలుగింతలు లాభాలుంటాయి."

" అవన్నీ నాకేం తెలుసమ్మా, బావ తెలివి తేటలమీద నాకు నమ్మకముంది. అలాగే చేయమను. మేం ఎప్పుడూ మీ సుఖం కోరేవాళ్లమే గదా. "

" నాకా సంగతి తెలియదా అన్నయ్యా, ఎంత సంపాదించినా ఆనంద్, సుమతిల సుఖం కోసమే గదా, ఈ పాట్లన్నీ. కాకపోతే పెట్టుబడి సంగతే. నా పొలం అమ్మి... "

" అలాగే అమ్ముదామమ్మా. నీ మూడెకరాల మీద మూడు లక్షలొస్తుంది. ఇంకేదయినా అవసరమయితే మరో యాభైవేలు నేను సర్దుతాను. సరేనా... " అన్నాడు కేశవయ్య.

చిన్నగా దగ్గి, మెల్లిగా చెప్పింది రాజ్యలక్ష్మి. " అది చాలదన్నయ్యా. నా పొలం అమ్మితే వచ్చే డబ్బు పోనూ మరో ఏడు లక్షలు నీ నుంచి కావాలి. ఈ పదిలక్షలూ, మేం ఇప్పటివరకూ పొదుపు చేసిన అయిదు లక్షలూ, అంతా కలిపి మా వాటా క్రింద పదిహేను లక్షలు వేసుకోవాలి. మిగతా అయిదుగురు ఇంజనీర్లు తలా పదిహేను లక్షల డబ్బు చేతబట్టుకొని రెడీగా ఉన్నారు. మీ బావ సంగతే... " నసిగింది రాజ్యలక్ష్మి.

కేశవయ్య ఏదో చెప్పబోయేలోగా ఎప్పుడూ మాట్లాడని ముసలి తండ్రి అందుకున్నాడు. " ఎందుకమ్మా వాడ్ని అలా బాధ పెడుతావు. కాయకష్టం చేసి వాడు అంతో ఇంతో ఆస్థి సంపాదించుకున్నాడు. అది కూడా కాజేస్తావా. మీ వ్యాపారం ఏం లాభాలు తెస్తాయో ఏమోగాని, వాడు ఆడపిల్లల తండ్రి. రేప్పొద్దున నీ మనస్సు మారి కాదన్నా వాడు ఏదో ఒక మంచి సంబంధం తెచ్చుకోవాలిగా. వాడ్ని వదులు. నీ ఆస్థి వరకూ నువ్వు అమ్ముకొని ఎత్తుకు పో. వాడ్ని జీవితాంతం కష్టపెట్టకు."

ఉన్నట్లుండి రాజ్యలక్ష్మి కళ్లలోంచి కన్నీరు జలజలా రాలాయి. " నాన్న ఏమంటున్నాడో చూసావా అన్నయ్యా. సుమతిని మేము చేసుకోమని ఎంత మాటన్నాడు. మీరు డబ్బు ఇచ్చినా ఇవ్వక పోయినా అది తప్ప నా ఇంటికి మరో కోడలుగా వస్తుందా. డబ్బు లేకపోతే ఆయన వ్యాపారం మానుకొని గొర్రెతోక బెత్తెడు లాంటి ఉద్యోగమే చేసుకుంటాడు. అంతేగాని సుమతిని నా కోడలు కాకుండా ఎవ్వరూ ఆపలేరు." అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

కేశవయ్య రాజ్యలక్ష్మి కేసి చూసి ఓదార్పుగా అన్నాడు. " భాధపడకమ్మా! నువ్వు అడిగిన పదిలక్షలూ నేనిస్తాను. నీ పొలం మూడెకరాలతో బాటు, నా పొలం మరో ఏడెకరాలు కూడా అమ్మి పది లక్షలూ ఇస్తాను. నెల తరువాత బావా నువ్వూ రండి. అప్పటికి డబ్బు రెడీ చేసి పెడతాను. "

రాజ్యలక్ష్మి ఆనందం అంతా ఇంతా కాదు. మరుసటి రోజే వైజాగ్ వెళ్లిపోయింది.

ముసలి తల్లీదండ్రీ, అంతమంచి పొలాన్ని అమ్మకురా అని నెత్తి నోరూ కొట్టుకున్నా వినలేదు. కేశవయ్య. పది ఎకరాల పొలాన్ని పది లక్షలకు అమ్మి నెల తరువాత వచ్చిన చెల్లెల్ని, బావను ఆదరించి, వారి దోసిట్లో ఆ డబ్బు పెట్టాడు. బాగా వృద్ధిలోకి రావాలని ఆరోజు దైవ ప్రార్దనలు కూడా చేయించాడు.

★ ★ ★

## అనుబంధం



తెరమీద అక్కినేని నటనకీ, నాగార్జున నటనకీ మధ్య చాలా వ్యత్యాసం ఉంది.

ఒకరు డైలాగ్ మాడ్యులేషనూ, హెవీడ్రామా. హావభావ ప్రదర్శనతో ప్రతిదానికి భావం ముఖంలో స్ఫురించేలా నటించగా.

నాగార్జున మాత్రం ఆకాశం అనేసరికి పైకి భూమి అనేసరికి కిందకి చూడవలసిన అవసరం లేదు. అలాగే చెప్పడంలో ఒరిజినాలిటీ ఉంటే చాలు. 'ఫీల్' వుంటే చాలు అంటారు నాగార్జున.

ఇక ఫంక్షన్లుకి వస్తే... అక్కినేని అయిన వాళ్లందర్నీ పలకరిస్తే నాగార్జున ప్రేమాభిమానాలు మనసులోనే వుంటే చాలు అంటాడు. అయినా వీరిద్దరి మధ్య అనుంబంధం మాత్రం ఒక్కటే! ఒకరి ఆలోచనలకి మరొకరు విలువనిస్తారు. విశ్వసిస్తారు మరి.

\- సాయిరాం

చూస్తుండగానే ఎనిమిది సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఎన్నో మార్పులు వచ్చాయి. కేశవయ్య మంచి మనస్సుతో ఇచ్చిన పది లక్షల రూపాయలకు తను మరో ఐదు లక్షల రూపాయలు కలిపి పదిహేను లక్షల రూపాయలు పార్ట్‌నర్‌షిప్‌తో పెట్టిన ' ఇంజనీర్స్ సిండికేట్ ' వ్యాపారం కనక వర్షం కురిపించింది. కోట్లు సంపాదించాడు శంకరరావు. బంగళాలు, తోటలు, కార్లు, అతని స్టేటస్ విపరీతంగా పెరిగి పోయింది. వైజాగ్‌లోని అపరకుబెరుల్లో ఒకడయ్యాడు. రాజ్యలక్ష్మి ఒళ్లంతా బంగారమే.

ఈలోగ ఆనంద్ కంప్యూటర్స్‌లో ఎం.టెక్ పూర్తి చేసాడు. అతను హైదరాబాదులో ఒక ప్రైవేటు సంస్థలో పెద్ద జీతంతో ఉద్యోగం చేస్తున్నాడు. అతని తరువాత ఆశయం స్టేట్స్‌కు వెళ్ళడం. ఇకపోతే సుమతి తెనాలిలో మేథ్స్‌లో బి. యస్సీ డిగ్రీ పూర్తి చేసి అందాల బొమ్మలా తయారై బావతో పెళ్లి కోసం సిద్దంగా ఉంది. ఆనంద్, సుమతిల మధ్య ప్రేమ ఉత్తరాలు, పెళ్లి కబుర్లు, తీయని ఊహలు నిర్విరామంగా జరిగి పోతున్నాయి. పెద్దలు నిర్ణయించే పెళ్లి ముహూర్తం కోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు.

పరిస్థితిలో పెద్దగా మార్పురానిది కేశవయ్యలోనే. చెల్లెలు కోసం తన ఆస్తిలో ఏడెకరాలు అమ్మగా తరువాత అతను మరో మూడు ఎకరాలు మాత్రం కొనగలిగాడు. మొత్తం పదెకరాలు పొలం సాగు చేస్తూ ముసలి తల్లితండ్రులను పోషిస్తూ కుమార్తెను డిగ్రీ దాకా చదివించాడు. ఇంతకుముందులా రాజ్యలక్ష్మి తరచూ అన్న ఇంటికి రావడం లేదు. ఆమెకు వచ్చే ఆదాయం లెక్కలు చూసుకోవడంలోనే కాలమంతా సరిపోతూ ఉంది. కేశవయ్య నాలుగు ఉత్తరాలు వ్రాస్తే, 'తీరిక ఉండడం లేదన్నయ్యా' అంటూ పొడిపొడి అక్షరాలతో ఒక ఉత్తరం ముక్క వ్రాస్తుంది. అందుకే అమ్మాయి డిగ్రీ పూర్తి కాగానే పెళ్లి ముహుర్తాలు గురించి మాట్లాడుదామని ఆ రోజు వైజాగ్ వెళ్లాడు కేశవయ్య.

బావతో, చెల్లెలితో విషయం కదిపాడు.

" నాదేముంది బావా. మీ చెల్లెలి నిర్ణయమే నా నిర్ణయం." శంకరరావు ఎప్పటిలాగానే అన్నాడు.

" ఆనంద్ స్టేట్స్‌కి వెళ్లాలనుకుంటున్నాడు. అన్నయ్యా. వాడు వెళ్లి వచ్చిన తరువాత ఆలోచిద్దాం" అంది రాజ్యలక్ష్మి.

" ఇందులో ఆలోచించేదేముందమ్మా! చాలా మంది ఇప్పుడు ఒకేసారి పెళ్లిళ్లు చేసుకొని ఫారిన్ వెళ్తున్నారు. పెళ్లి చేసి పంపిచేస్తే ఇద్దరూ చిలకా గోరింకల్లా ఒకరికొకరు తోడుగా ఉంటారు. "

ఏంచెప్పడానికీ తోచలేదు రాజ్యలక్ష్మికి " అన్నీ ఆలోచించి వారం రోజుల్లో ఉత్తరం వ్రాస్తానన్నయ్యా. ఇన్‌కంటాక్సు వాళ్లకు లెక్కలు ఇవ్వాలి. ఆడిటర్స్ ఆ పనిలో ఉన్నారు. నేను దగ్గరుంటే కాని పనికాదు. నువ్వెళ్లన్నయ్యా." అంది.

" అలాగే నమ్మా, నేను వస్తా. " అంటూ తిరుగు ప్రయాణమయ్యాడు. తన కుమార్తె ఇంత ఆస్తికి వారసురాలవుతున్నందుకు అతని ఆనందం అంతా ఇంతా కాదు.

ఆ ఆనందం మూటగట్టుకొని వచ్చిన కేశవయ్య ఇంట్లో అందరికీ, త్వరలో తన చెల్లెలు రాజ్యలక్ష్మి ఉత్తరం వ్రాస్తుందని, అప్పుడు అందరూ వైజాగ్ వెళ్లి ముహూర్తాలు పెట్టుకొని రావలసివస్తుందనీ చెప్పాడు. అంతేగాక కేశవయ్య తన కుమార్తె అదృష్టాన్ని ఊరంతా చెప్పి, కుమార్తె పెళ్లి ఎంత వైభవంగా చేయాల్నో, ఎంత ఖర్చవుతుందో, లాంఛనాలు ఏమివ్వాల్నో ఊరిపెద్దలతో చర్చిస్తూ సంతోషంగా గడిపేస్తూంటే, సుమతి మధురమైన ఊహలతో, తీయని కలలతో కాలం గడుపుతోంది.

చెల్లెలి ఉత్తరం కోసం ఎదురు చూస్తున్న కేశవయ్యకు పదిహేను రోజులయినా జవాబు రాలేదు. మళ్లీ ఓ ఉత్తరం వ్రాసి పడేసాడు. దానికీ జవాబు రాలేదు.

" నేను మళ్లీ ఒకసారి వైజాగ్ వెళ్లివస్తానమ్మా." అన్నాడు కుమార్తెతో ఒకరోజు.

" ఎందుకు నాన్నా. మాటిమాటికీ అంతంతదూరం వెళ్లి వస్తానంటావు. ఇంకొన్ని రోజులు చూద్దాం. "

ఇంకో వారం గడిచింది. జవాబు లేదు. ఆరోజు కేశవయ్య చెల్లెలు ఉత్తరం కోసం అప్పటివరకూ ఎదురుచూసి పొలం వైపు వెళ్లాడు. ఓ అరగంట తరువాత ఇంటి వరండాలోకి వచ్చిన సుమతికి, తనింటి వైపే వస్తున్న పోస్ట్‌మాన్ కనిపించాడు. చూస్తుండగానే అతను ఆమె చేతిలో ఓ లెటరు పెట్టి వెళ్లిపోయాడు. అది వైజాగ్ నుంచి తన మేనత్త వ్రాసిన ఉత్తరం.

శరీరం గాలిలో తేలిపోతుండగా, తన గది తలుపులు తోసుకొని వెళ్లి బెడ్‌మీద వెళ్లికలా పడుకొని, ఆ ఉత్తరం విప్పింది. ముందు ఎంత ఊహల్లో తేలిపోయిందో, ఆ ఉత్తరం చదివిన తరువాత ఆమె అంత నిరాశతో కుంగి పోయింది. కొంతలో కొంత ఆ ఉత్తరం తన తండ్రి చేతిలో పడనందుకు ఎంతో సంతోషించింది. అదే గనుక తన తండ్రి చేతిలో పడి ఉంటే తన తండ్రి ఏమయిపోయేవాడో. తలచుకుంటేనే ఆమెకు భయంగా ఉంది.

అన్నయ్యా !

ఒకప్పుడు నీ ఋణం తీర్చుకోవడానికి సుమతిని నా కొడుక్కి చేసుకుంటానన్నది నిజమే. కాని, ఇప్పుడు ఆలోచిస్తే నా అమాయకత్వానికి నాకే నవ్వు వస్తోంది. అన్నగా నీ బాధ్యతగా నా పెళ్లి చేసావు. ఆస్థిలో నావాటా నాకిచ్చావు. ఇందులో నేను నీకు ఋణపడి ఉన్నది ఏముంది చెప్పు. నీవు నీ ఆస్థి అమ్మి ఎనిమిదేళ్ల క్రితం ఇచ్చిన ఏడు లక్షలూ ఈనాటికి బ్యాంకు వడ్డీరేట్ల ప్రకారం పదహారు లక్షలు అవుతుంది. ఆ మొత్తానికి ఇందువెంట చెక్కు పంపిస్తున్నాను.

ఇక, నీకు నేను ఏమీ బాకీ లేను. ఆ డబ్బుతో సుమతికి ఏ ఇంజనీరో, డాక్టరో వరుడిగా దొరుకుతాడు. నేనే అలాంటి వాడ్ని వెతికి నా చేతులతో దగ్గరుండి పెళ్లి జరిపిస్తాను. అన్నయ్యా! ఇప్పుడు మా ఆస్తి వందకోట్లు. అనంద్‌కు కోటి రూపాయలు కట్నం ఇస్తాం అంటూ కోటీశ్వరులు మా ఇంటిముందు క్యూ కడుతున్నారు. నీ కూతుర్ని చేసుకుంటే, వైజాగ్‌లోని అతికొద్దిమంది కోటీశ్వరులలో ఒకరమయిన మేము నలుగురికీ నిన్ను ఏమని పరిచయం చేయాలి. పల్లెలో పదెకరాలు మట్టిపిసుక్కొనే రైతు మా

## 'కూత ఘనం'



**త**క్కువగా మాట్లాడి ఎక్కువగా చేతల్లో చూపించే మహేష్‌బాబు ఇటీవల మాటల్లో కూడా తనదైన స్టైల్ చూపిస్తున్నాడు.

ఇటీవల రిలీజైన 'మురారి' సినిమా హిట్టా? ఫట్టా? హడావుడి చేయడం లేదేం? మిమ్మల్ని ఆర్టిస్ట్‌గా బాగా ఎలవేట్ చేసిన చిత్రమంటున్నారు. ఇండస్ట్రీ వాళ్ళు మీరేవంటారు? అనడిగాను.

దానికాయన సన్నగా నవ్వేసి "మురారి సినిమా హిట్ అని ప్రత్యేకించి చెప్పవలసిన పనేముంది? పోతే నేను ఆర్టిస్ట్‌ని అనే విషయం నా మొట్టమొదటి చిత్రమే ప్రూవ్ చేసింది. ఇంకా కొత్తగా ప్రూవ్ చేసుకొనే అవసరం ఏవుంది? అన్నాడు సూటిగా.

ఆ మాట ప్రేక్షకులు కూడా అనాలిగా!

-సాయిరాం

వియ్యంకుడనా? సంఘంలో మా పరువు ప్రతిష్టలు ఏంగాను?

అన్నయ్యా ! ఇక ఆనంద్‌ని మరచిపోండి. వాడికి కోటీశ్వరుల బిడ్డతో పెళ్లిచేసి అమెరికాకు పంపిస్తాను. ఈ విషయం ఇక ప్రస్తావించవద్దని మనవి చేసుకుంటున్నాను.

ఇట్లు
నీ చెల్లెలు,
రాజ్యలక్ష్మి.

ఉత్తరానికి తండ్రి పేరున పదహారు లక్షలకు చెక్కు పిన్ చేసి ఉంది.

ఊహించని ఈ ఉత్తరానికి సుమతి హృదయం తల్లడిల్లిపోయింది. మనసు రెక్కలు తెగిన పక్షిలా గిలగిలా కొట్టుకుంది. చాలాసేపు ఆమె రోదిస్తూ ఉండిపోయింది. తరువాత తెప్పరిల్లి కర్తవ్యం ఆలోచించసాగింది. ఆలోచనలు ఒక రూపానికి రాగానే కార్యక్రమానికి దిగింది.

పెళ్లయిన నాటినుండీ తన మేనత్త తండ్రికి వ్రాసిన ఉత్తరాలన్నీ తేదీలవారీగా ఒక వరుసలో పెట్టి దారంతో కట్టింది. తరువాత ఆనంద్ తనకు వ్రాసిన ప్రేమలేఖలు కూడా అలాగే కట్టింది. తరువాత ఆనంద్‌కొక ఉత్తరం వ్రాసింది.

ఆనంద్ బావకు,

ఇదే నేను నీకు వ్రాసే ఆఖరు ఉత్తరం. కారణం మీ అమ్మ వ్రాసిన ఉత్తరం ఈరోజే అంది, మీ అందరి అభిప్రాయాలు తెలిసాయి. మీ ఇంట్లో మీ అమ్మదే డామినేషన్. మీ నాన్న ఎంతమంచి వాడయినా మీ అమ్మ ముందు తల ఊపాల్సిందే. ఆ తల్లి కొడుకువు కదా ! నువ్వు అంతే. ఏమీ లేని వాళ్లకు అర్థాంతరంగా ఆస్తులు వస్తే, అహం కారంతో మిడిసిపడటం మామూలే, ఏ కొందరో జ్ఞాన వంతులైన మంచి వాళ్లు తప్ప. అదే అహకారంతో మీ అమ్మ రక్తసంబంధాలను, ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలను పదహారు లక్షల రూపాయల చెక్కుతో తుంచి వేసింది. ఆమె మా నాన్నకు పెళ్లయినప్పటినుంచి కన్నీటితో వ్రాసిన ఉత్తరాలన్నీ చదువు. మా నాన్న ఆమెకోసం చేసిన త్యాగమేమిటో అర్థమవుతుంది. మీరు సంపాదించిన ఈ కోట్ల రూపాయలకు మూలం మేము మా అస్థిని అమ్మి ఇచ్చిన ఏడు లక్షల రూపాయలే. ఏ బ్యాంకు ఇన్ని లక్షలు ఏ హామీ లేకుండా ఏ రాతకోతలు లేకుండా ఇవ్వదు. అది నీకు తెలుసు.

సంస్కారంలేని మీ అమ్మ ఒకప్పటి తన పల్లెటూరి భాషలో చెప్పినట్లు మా నాన్న మట్టిపిసుక్కునే రైతే. కాని నగరాల్లో మీరు స్టార్ హోటళ్లలో, ఎ.సి. రూముల్లో రకరకాల రూపాల్లో తినే ఆహారపదార్థాలు ఆ రైతు పొలాల్లో పండిచినవే అన్నది మాత్రం మరువద్దు. మీ అమ్మ చెప్పినట్లు నేను అన్ని అనుబంధాలు తెంచుకొని మరొకర్ని పెళ్లి చేసుకోను. తెల్లచీర, జాకెట్టు ధరించి, ఈ ఐహిక సుఖాలకు దూరంగా ఏ దైవ సన్నిధిలోనో సన్యాసినిలా నా జీవితాన్ని గడుపుతాను. అందుకే మనకి సంబంధించిన ఏ గుర్తూ ఉండకూడదని నీవు వ్రాసిన ప్రేమలేఖలన్నీ నీకే తిరిగి పంపుతున్నాను. వాటిని నీ చేత్తోనే కాల్చేయ్. మా తల్లిదండ్రులకు ఎలాంటి ఉత్తరాలు వ్రాసి వాళ్లని బాధించకు.

ప్రస్తుతానికి నీకుఏమీకాని ఒకప్పటి నీ మరదలు

సుమతి.

ఆ ఉత్తరానికి తన మేనత్త పంపిన లెటరు చెక్కుతో సహా పిన్ చేసింది. తరువాత ఆమె తన తండ్రికి పెళ్లయిన నాటినుండీ వ్రాసిన ఉత్తరాల కట్టను, తనకు ఆనంద్ వ్రాసిన ప్రేమలేఖల కట్టను ఒక దానిమీద ఒకటి పేర్చి, దానిమీద తన ఉత్తరాన్ని పెట్టి దారంతో ఒకటిగా కట్టింది. తరువాత దాన్ని బ్రౌన్ పేపరుతో నీట్‌గా ప్యాక్ చేసింది. ఇంట్లో ఉన్న ఖద్దరు బట్టను నలుచదరంగా కత్తిరించి దానిమీద ఈ ప్యాకట్ నుంచి అన్ని వైపులా బట్టను మడచి సూదితో టైట్‌గా కుట్టి పార్శిల్ చేసింది.

దానిమీద హైదరాబాదులో ఉన్న బావ అడ్రసు వ్రాసి, ప్రక్కింటి కుర్రాడ్ని పిలిచింది.

" ఒరే, దీన్ని అర్జంటుగా తీసుకెళ్లి రిజిస్టర్ పార్శిల్ చేసిరా. " అంటూ ఆ పార్శిల్ అందించింది.

టెన్త్ క్లాసు చదువుతున్న వాడు దానిమీద ఆనంద్ అడ్రసు చూసి " అక్కా, ఇది బావకు చిరుకానుకా... " అన్నాడు కొంటెగా.

" నువ్వు నోర్మూసుకొని వెళ్లరా. ఇది బావకు చిరుకానుక కాదు. చివరి కానుక. " అంది కోపంగా.

వాడు సైకిల్ వెనకాల దాన్ని పెట్టుకొని తుర్రుమన్నాడు. వాడికి వీళ్ల ప్రేమకథ చిన్నప్పటినుండీ తెలుసు. వీడే మొదటినుండీ సుమతి వ్రాసిచ్చిన లెటర్లు పోస్టులో వేసేది. వాడు పార్సెలు పోస్టుచేసి రశీదు తెచ్చిచ్చిన తరువాత సుమతి మనసు కుదుటపడింది.

ఆ రోజు పొలం నుచి వస్తూనే కేశవయ్య " తల్లీ, మీ అత్తయ్య దగ్గర నుంచి ఇప్పటికీ ఉత్తరం రాలేదు. రేపే వైజాగ్ వెళ్లి వస్తాను. " అన్నాడు.

వద్దులే నాన్నా, అక్కడ అత్తయ్యకెన్ని పనులో. ఇంకో పదిరోజులు చూసి అప్పుడు వెల్దువుగానిలే." అంది అసలు విషయం చెప్పకుండా.


" ఎన్ని పనులువ్వా, స్వంత పనికి అవన్నీ అడ్డువస్తాయటమ్మా." గొణుక్కుంటూ లోపలికి వెళ్లిపోయాడు కేశవయ్య.

పాపం పిచ్చి నాన్న. చెల్లెలంటే ఎంత అభిమానం. చెల్లెలు మనసులోని విషయం తెలుసుకొని ఉంటే నిజంగానే పిచ్చివాడయిపోయి ఉండేవాడు అనుకొంది. ఆ రాత్రంతా నిద్రపట్టక పొర్లుతూనే ఉంది సుమతి. బావ ఆ ఉత్తరం చూసి ఎలా రియాక్టవుతాడో, ఎలాంటి జవాబిస్తాడోనన్నది ఆమె ఆలోచన.

చిన్నతనం నుంచీ తల్లిదండ్రుల ఎడల భయభక్తులు ఉన్న బావ, తల్లి నిర్ణయాన్ని కాదనగలడా? వాళ్లను ఒప్పించి ఎలాగయినా తనను చేసుకుంటాడా? కాని, తనకు నమ్మకముంది. తనను తప్పక చేసుకుంటాడని. కోట్లకు ఏకైక వారసుడైన బావకు తనమీద గాఢమైన ప్రేమ ఉంది. ఎలాగయినా బతిమాలో, బామాలో తన తల్లిదండ్రులను ఒప్పించగలడు.

కాని, అంతలోనే ఆమెకు అపనమ్మకం. అత్తయ్య పట్టుదల గల మనిషి. తాను చచ్చిపోతానని బెదిరిస్తే బావ మాత్రం ఆమె మాట

## డిసైడ్ చేయకండి



మునుపటి రోజుల్లో సినిమా విడుదల యిన మరుసటి రోజు ఫస్ట్ షో చూసొచ్చి సినిమా జాతకం ఏంటో డిసైడ్ చేసే రోజులు పోయాయి. మీకు సిన్సియర్‌గా సినిమా మీద పబ్లిక్ ఒపీనియన్ తెలియాలంటే కనీసం రెండు వారాలు పడుతుంది. నా సినిమాలు 'పెళ్ళి' గాని 'చాలా బాగుంది' సినిమాగాని రెండు మూడు వారాల తర్వాత ఊపందుకున్నాయి. 'మా ఆవిడమీదొట్టు, మీ ఆవిడ చాలా మంచిది' చిత్రం చాలా బావుంది నిజానికి. అయితే ఈ టాక్ స్ప్రెడ్ అయ్యి ఎస్టాబ్లిష్ అవ్వాలంటే కొంచెం సమయం పడుతుంది. ఈలోగా 'ఫట్' అనో ఫిట్ అనో డిసైడ్ చేస్తే ఎలా? సూటిగా ప్రశ్నించారు నవీన్. నిజమే మరి!

-సాయిరాం

వినకుండా ఉంటాడా? ఆమె చెప్పిన సంబంధం చేసుకోకుండా ఉంటాడా? ఇంతకూ బలయ్యేది తమూ, తన తండ్రిమాత్రమే.

రోజులు గడుస్తున్నాయి. వారమయినా బావ దగ్గరనుంచి ఎలాంటి రిప్లయీ రాలేదు. ఇక అన్నీ ఆశలు వదులుకొంది సుమతి. ఇక రిప్లయి రాదని నిర్ణయించుకున్న సుమతి, గుండెను బండరాయి చేసుకొంది. సరిగ్గా పదోరోజు తన పేరుమీద ఒక రిజిష్టరు లెటరు, తన తండ్రి పేరు మీద ఒక రిజిష్టరు పార్శెలు తెచ్చాడు పోస్ట్‌మాన్. రెండూ ఆనంద్ బావ దగ్గరనుంచి వచ్చినవే. ఆశ్చర్యపోయింది సుమతి.

తన పేరు మీద వచ్చిన విశాలమైన ఒక పెద్ద ట్రే అంత వెడల్పున్న కవరును సంతకం పెట్టి తీసుకుంది సుమతి. పార్శెలు తండ్రి పేరుమీద వచ్చింది. ఆ పార్శెలు చూసి గతుక్కుమంది సుమతి. తను పార్శెలు చేసి పంపిన అత్తయ్య లేఖలు, తనకు బావ వ్రాసిన ప్రేమలేఖలు అవి. తను వాటిని క్లాత్ కవరులో పార్శెలు చేసి పంపితే, ఇప్పుడు వాటిని బావ తన స్టేటస్‌కు తగ్గట్లు ఖరీదైన ప్లాస్టిక్ పేపర్‌లో నైస్‌గా ప్యాక్ చేసి పంపాడు. ఏమయితేనేం సైజు అదే. లోపల మెటీరియల్ అదే. మారింది ప్యాకింగ్ మాత్రమే.

“ ఫరవాలేదు. అది కూడా నువ్వే తీసుకోఅమ్మా. బావ నీ కేదో బహుమతి పంపుతాడు. ” అన్నాడు వాకిట్లోకి వచ్చి, విషయం తెలుసుకున్న తండ్రి.

“ నీ పేరుమీద వచ్చిందిగా. నీకే పంపాడు బహుమతి. నువ్వే తీసుకో ” అంటూ కోపంగా లోపలికి వచ్చేసింది సుమతి.”

“ నాన్న ఆ ఉత్తరాలు చూస్తే చూడనీ. అప్పుడు అసలు విషయం చెప్పి, తనకీ జన్మకు పెళ్లి వద్దని తన నిర్ణయం కూడా చెప్పేస్తాను. ” అనుకుంటూ బెడ్ మీద పడుకొని ఇష్టం లేకపోయినా కవరు చింపింది.

అందులో బావ తనకు వ్రాసిన చిన్న లెటరు. దానికి కుట్టిన ‘ మా పెళ్లికి రండి ’ అన్న పెద్ద పెద్ద అక్షరాలతో పంచరంగుల్లో ఉన్న విశాలమైన వెడ్డింగు కార్డు.

ఆమెకు గుండె ఆగినట్లయింది. కళ్లలోంచి కన్నీళ్ళు వెల్లువలా క్రిందికి దూకాయి. అయితే తను అనుకున్నంతా అయిందన్నమాట. అమ్మ మాట విని ఆమె కుదిర్చిన సంబంధానికి ఒప్పుకున్నాడన్న మాట. ఆలస్యం అయితే తాము ఏ గొడవలు తెస్తామోనని, తల్లిదండ్రులతో సంప్రదించి ఒకేసారి పెళ్లి కుదుర్చుకొని తనకు వెడ్డింగ్ కార్డు పంపాడన్నమాట. కన్నీటితో మసకలు కమ్మిన కళ్లతో వెడ్డింగ్ కార్డును కళ్లెత్తి కూడా చూడకుండా దాన్ని ప్రక్కన ఉంచి ఉత్తరం చదవసాగింది.

డియర్ సుమతీ !

ఏమిటోయ్, నీ ఉత్తరం. ఇందులో తీపి ముద్దులు లేవు, వేడి నిట్టూర్పులు లేవు. ఈటెల లాంటి మాటలు తప్ప, ఫరవాలేదు. ఇవన్నీ నీ గాఢమైన ప్రేమకు మచ్చుతునకలు. అయినా అప్పుడే అత్తాకోడళ్ల మధ్య కోల్డ్‌వారా ! మీ నాన్న మా కుటుంబానికి చేసిన సహాయాలను గుర్తుచేసావు, నాకు తెలియదా. అర్థం చేసుకోలేని మూర్ఖుణ్ణా నేను. అత్త మీద కోపం దుత్తమీద చూపినట్లు మా అమ్మ మీద కోపం నా మీద చూపించి, నా ప్రేమలేఖలు తగలబెట్టమని పంపిస్తావా. నువ్వు పంపిన పార్శెలును నీ ప్రేమకానుకగా నా బీరువాలో దాచాను.

## సెంటిమెంటు



‘మనసులో మాట’ చిత్రంలో నటించిన విజయవాడ అమ్మాయి ‘శిప్రా’ మంచి మాటకారి. నేను జీవితంలో మంచి సూపర్‌హిరోయిన్‌గా సెటిలవుతాను అంటుంది సీరియస్‌గా.

మీకు జోస్యం తెలుసా? అనడిగాను.

“అవసరం లేదు. కృష్ణ నీళ్ళు అటువంటివి. శారదగారు, గుమ్మడిగారు, కృష్ణగారు అంతెందుకు నిన్నగాక మొన్న రంభగారు, రవళిగారు, లయ ఎవర్ని తీసుకోండి. టాప్ పొజిషన్‌కి వచ్చి తీరాలి. అది సెంటిమెంట్ తాత్కాలికంగా మార్కెట్ డల్‌గా వున్నా రేపు టాప్ పొజిషన్‌కి వెళ్ళడం ఖాయం!” అంటూ ఘంటాపథంగా చెప్తోంది శిప్రా. అదో సెంటిమెంటూ.

- సాయిరాం

నువ్వన్నట్లు మా అమ్మకున్న అహం, పట్టుదల నాకూ వచ్చేయోయ్. అందుకే నీ సీరియస్ నిర్ణయం విన్న తరువాత నువ్వెక్కడ సన్యాసిని వయిపోతావో నన్న భయంతో ఇక్కడ పురోహితుల్ని సంప్రదించి మనిద్దరికీ పెళ్లి ముహూర్తాలు పెట్టించేసాను. మన పెళ్లికి మనమే పెద్దలం. మనమే నిర్ణేతలం. తల్లిదండ్రులు, మిగతా బంధువర్గమంతా ఆహూతులు మాత్రమే. ఆస్తులు, అంతస్తులతో సంబంధం లేకుండా నువ్వే నాకు కావాలి. పెళ్లి కార్డులు కొట్టించి అటు వైజాగ్‌లోని మా బంధుమిత్రులకు, ఇటు మీ ఊళ్లోని బంధుమిత్రులకు పోస్ట్ చేసాను.

అంతేగాక, మా తల్లికి, మీ తండ్రికి చెరో అయిదు వందలు వెడ్డింగ్ కార్డులు రిజిష్టరు పార్శెలు చేసి పంపాను. ఇంకెవరికయినా తెలిసిన వాళ్లకు పంచుకుంటారని. ఇవి అందరికీ ఒకేరోజు చేరుతాయి. ఈ లెటరుకు కుట్టిన మన పెళ్లి పత్రిక చూడు. పెళ్లి శనివారం రాత్రి పది గంటలకు, తిరుమల హిల్స్ పైన. ఇక నాలుగు రోజులే ఉంది. ఒకరోజు ముందుగా నా స్నేహితులు వెళ్లి అక్కడ అన్ని ఏర్పాట్లు చేస్తారు. శనివారం ఉదయం అరుగంటలకు మీ ఇంటిముందు నా కారు హారను వినబడుతుంది. కట్టుబట్టలతో వచ్చి కారెక్కు. మన పెళ్లికి అంగీకరించిన వాళ్లే వస్తారు. నువ్వు ఎప్పటికీ నా దానివే. మన ఇద్దరం ఇద్దరం కాదు, ఒక్కరమే.

ఏనాటికీ నీ వాడు,
ఆనంద్.

ఆ ఉత్తరం చదివిన సుమతి ఎద ఆనందంతో పొంగి పోయింది. ఈ పది రోజులూ ఆవేదనతో, ఆలోచనతో కాంతి తగ్గిన ఆమె ముఖంలో కాంతి మళ్లీ ఎగ బ్రాకింది. మెల్లగా ఆ వెడ్డింగ్ కార్డును చేతిలోకి తీసుకొని ముద్దుపెట్టుకొని చదివింది.

‘ మా పెళ్లికి రండి ’ అని పెద్ద పెద్ద అక్షరాలతో హెడ్డింగ్ ఉన్న పంచరంగుల్లో ముద్రింపబడిన వెడ్డింగ్ కార్డు అది. దాని క్రింద తిరుమలలో పెళ్లి జరిగే సమయం, కళ్యాణవేదిక ఉన్న స్థలం వ్రాసి ఉంది. దానికి అడుగున, ఇట్లు, ఆనంద్-సుమతి, పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తె మరియు ఆహ్వానితులు అని ఉంది.

బావ ధైర్యానికి, సెన్సాఫ్ హ్యూమరుకు మనసులోనే అభినందనలు తెలిపింది సుమతి. కిటికీలోంచి చూసిన ఆమెకు, పెద్ద సైజు పెళ్లికార్డులున్న కవర్లు పట్టుకొని వస్తూన్న ఆ ఊరివాళ్లు చాలామంది కనిపించారు. ❋